

# ఎలిజీలు
## – గొల్లపూడి మారుతీరావు



కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన ఆశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)



**రేడియో అన్నయ్య**

తరువాత తరువాత చాలా విషయాలు నన్నాకర్షించాయి కానీ మరీ చిన్నతనంలో రేడియోను వెతుక్కుంటూ ప్రతి ఆదివారం పక్కిళ్ళకి పరిగెత్తేటట్టు చేసే కార్యక్రమం ఒక్కటే - చిన్నపిల్లల కార్యక్రమం. ఇవాళ గవాస్కర్, అమితాబ్ బచన్‌ల గురించో మరెవరి గురించో గంగవెర్రులెత్తడం చూస్తున్నాం. కానీ ఆ రోజుల్లో మాకు తెలిసిన హీరో, హీరోయిన్లు రేడియో అన్నయ్య, అక్కయ్యలు. వారి మాటలు అమృతప్రాయంగా కళ్ళముందు కూర్చునే మాతో కబుర్లు చెప్తున్నట్టు అనిపించేది. రేడియో మీడియంకు ఇంకా వయస్సు రాకముందే రేడియోలో ప్రవేశించి మీడియంని ఇంత అద్భుతంగా ఉపయోగించవచ్చునని ఆ రోజుల్లోనే (అంటే దాదాపు 60 ఏళ్ళ క్రిందటే) నిరూపించిన గొప్ప ప్రసార కర్తలు అన్నయ్యగారు, అక్కయ్యగారు.

ప్రసారం చెయ్యడం ఎలాగో చదివితేనో తర్ఫీదు పొందితేనో వచ్చేదికాదు. మరి వారిద్దరిలోనూ ఏమిటి గొప్పతనం? వారు నిర్వహించేది పిల్లల కార్యక్రమం. రోజూ వందలాది మంది పసివారితో సాంగత్యం. కానీ ఆ దంపతులకు పిల్లలులేరు. చుట్టూవున్న ప్రతిబిడ్డనీ తన బిడ్డని చేసుకునే 'హృదయం' వారి గొంతులో పలికేది. ఆ హృదయంలోని స్పందనని ఏ పసివాడూ తప్పించుకోలేకపోయేవాడు. అదే అన్నయ్యగారి ప్రసారాల్లో రుచి.

నా పద్నాలుగో ఏట రేడియో అంటే గుర్తు. అన్నయ్యగారూ, అక్కయ్యగారూ. ఆ తర్వాతే రావు బాలసరస్వతి పాటలూ, కృష్ణశాస్త్రిగారికి భక్తి రంజనీ, మల్లిక్ బాణీలూ, జనమంచి రామకృష్ణగారి నాటికలూ ఇలా ఎన్నయినా చెప్పగలను. పద్నాలుగో ఏటనే అన్నయ్యగారిని హైదరాబాద్ రేడియో స్టేషన్లో కలిశాను. ఆ రోజు ఓ కుర్రాడికి జీవితంలో మరుపురాని రోజు. ఆయన ముందు పిల్లలకి తర్ఫీదు ఇవ్వడం ఏదో కలలాగా చూస్తూ కూర్చున్నాను. ప్రోగ్రాం టైముకి స్టూడియోలకి వెళ్ళడానికి ఉవ్విళ్ళూరుతున్నాను. కానీ నన్ను బయటే ఎటెండరు ఆపేశాడు. ఆ రోజు చాలా గింజుకుపోయాను.

అదృష్టవశాత్తు మరో ఎనిమిదేళ్ళ తరువాత అదే స్టేషన్లో డ్యూటీ ఆఫీసరు ఉద్యోగంతో వచ్చాను. అప్పటికి రచయితగా కాస్త పేరు వచ్చింది. రాఘవరావుగారు ఆనందంగా పలకరించేవారు. ఓ రోజు అతిధులతో నా దగ్గరకు వచ్చారు అన్నయ్యగారు. నా ఉద్యోగం స్టూడియో ఇన్‌చార్జి. అతిధుల్ని పరిచయం చేసి లోపలికి పంపడానికి నా అనుమతి కోరారు. ఆయన్ని కూర్చోపెట్టి టీ తెప్పించి "ఎనిమిదేళ్ళకిందట ఓ కుర్రాడు మీతో రేడియో ప్రోగ్రాం చూడాలనుకున్నాడు. ఆరోజు మీరు తీసుకెళ్ళలేదు. కానీ ఇవాళ మీ అతిధులకి నేను అనుమతి ఇస్తున్నాను" అన్నాను నవ్వుతూనే ఆ సందర్భాన్ని గుర్తు చేసి. అది కేవలం నాలో చిలిపితనం మాత్రమే. అన్నయ్యగారు నవ్వేశారు.

వయస్సు మీరినకొద్దీ అక్కయ్యగారు స్త్రీల కార్యక్రమానికి, అన్నయ్యగారు పిల్లల కార్యక్రమానికి అంకితమయిపోయారు. అవి వారి అభిరుచులేమో అనుకునేవాడిని. ఓ రోజు అనౌన్సర్ గదిలో కూర్చుని నేనూ, అక్కయ్యగారూ పిల్లల ప్రోగ్రాం చేస్తున్నాం. ఉన్నట్టుండి ఆమె కళ్ళవెంట కన్నీరు కారింది. "నాక్ పిల్లల ప్రోగ్రాం అంటే ఎంత ప్రాణమో. ఆయనే రానివ్వరు. నా ఆరోగ్యం బాగోలేదని తెలిసి" అని వాపోడం బాగా గుర్తుంది.

పసిపిల్లల్ని ఆనందపరిచే వెయ్యి రకాల ఆలోచనలు అన్నయ్యగారి మనస్సులో పరుగుతియ్యడం నాకు తెలుసు. ఇంకా మరుపురాని సంఘటన మేమిద్దరం కలిసి స్టేజి నాటకం వేశాం. భమిడిపాటి రాధాకృష్ణ "దంత వేదాంతం". బయటి ప్రపంచంలో మా అందరికీ అన్నయ్యగారు ఆ రోజు రంగస్థలం మీద నాకు అల్లుడు. ఆయన ఎంత "ఈజ్" ఉన్న నటులో ఆ రోజు చూశాను.

చాలా సందర్భాలలో స్టూడియోలో పదిమంది పిల్లలున్నా, కార్యక్రమం ప్రారంభం కాగానే కళ్ళు మూసుకుని "ఆహోహ! కార్యక్రమానికి ఎంతమంది వచ్చార్రా. ఆ దూరంగా కూర్చున్న ఎర్ర షర్ట్ అబ్బాయి - అవునా నీ గురించే ఇలారా ఏదో పద్యం చదువుతానంటున్నాడు" అంటూ ఉపోద్ఘాతం చెప్పి టేపు చేసి ప్రోగ్రాం వెయ్యడం నాకు తెలుసు. ఆ సందర్భాల్లో అనుకునేవాణ్ణి, మన ఊహల్లో అపూర్వమయిన వాతావరణాన్ని కల్పించడమే కాకుండా ఆ కల్పనలో ఏనాడూ 'హృదయం' వదలని అపూర్వమయిన ప్రసారకర్త అన్నయ్యగారు. ఆయన నాలుగయిదు తరాలకి అన్నయ్యగారు. నాకూ అన్నయ్యగారు. ఆయన రేడియోలోంచి రిటైరయ్యాక నేను ఒక్కసారి కనీసం ఒక్కసారి కూడా పిల్లల కార్యక్రమం వినలేదు.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments